బ్యాంకు పరీక్షార్థులను ఆనందాశ్చర్యాలతో ముంచెత్తుతూ ఐబీపీఎస్ ఒకేసారి రెండు నోటిఫికేషన్లు.. (ప్రొబేషనరీ ఆఫీసర్లు, స్పెషలిస్ట్ ఆఫీసర్లు) విడుదల చేసింది. ఐబీపీఎస్ పీఓ నోటిఫికేషన్‌ను మాత్రం సాధారణ సమయానికే విడుదల చేసినా.. స్పెషలిస్ట్ ఆఫీసర్స్ నోటిఫికేషన్‌ను రెండు నెలల ముందే విడుదల చేసింది. దేశవ్యాప్తంగా పీఓ ఖాళీలు 3049, స్పెషలిస్ట్ ఖాళీలు 1402 - అంటే మొత్తం 4451 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు.

బ్యాంకుల్లో భారీ కొలువులు!

బేసిక్స్ అన్నీ పూర్తయ్యాక పరీక్ష తరహాలో ఉండే మోడల్ పేపర్లు ప్రతి రోజూ ఒకటి రాయాలి. దాన్ని విశ్లేషిస్తూ సన్నద్ధతను మెరుగుపరుచుకోవాలి. ఇదంతా ఒక పద్ధతి ప్రకారం జరగాలి. బేసిక్స్ నేర్చుకోవడం, ప్రాక్టీస్ చేయడం, టెస్ట్‌లు రాయడం.. ఇలా కొనసాగాలి. దీనివల్ల ప్రిపరేషన్ ఏ విధంగా కొనసాగుతోందో అభ్యర్థులకే అర్థమవుతుంది.

ఐబీపీఎస్ ద్వారా రిక్రూట్‌మెంట్ జరిపే 11 ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 5 మాత్రమే ఖాళీల వివరాలను పేర్కొన్నాయి. ఇంకా 6 వెల్లడించలేదు. వీటిలో బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాంటి పెద్ద బ్యాంకులు కూడా ఉన్నాయి. దీంతో రాబోయే రోజుల్లో ఈ ఖాళీల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది.

ఐబీపీఎస్ పీఓ పరీక్షకు డిగ్రీ అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కానీ స్పెషలిస్ట్ ఆఫీసర్ల పోస్టులకు సంబంధించిన విద్యార్హత ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. రెండు పరీక్షలు రాసే అవకాశం ఉండే అభ్యర్థులకు ఇది డబుల్ బొనాంజా.

ఐబీపీఎస్ పీఓ పరీక్షకు ప్రిపేర్ అయితే స్పెషలిస్ట్ ఆఫీసర్ ప్రిలిమ్స్ పరీక్షకు అది సరిపోతుంది. మెయిన్స్ పరీక్షకు ప్రత్యేకంగా సన్నద్ధం కావాలి.

ఎంపిక

రెండు పరీక్షల్లోనూ మూడు అంచెలుంటాయి. మొదటి దశలో ప్రిలిమ్స్, రెండో దశలో మెయిన్స్, మూడో దశలో ఇంటర్వ్యూ ఉంటాయి. ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైనవారే మెయిన్స్‌కు అర్హత సాధిస్తారు. దానిలో నిర్ణీత మార్కులతో ఉత్తీర్ణులైనవారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. అభ్యర్థులకు మెయిన్స్ ఆబ్జెక్టివ్ పరీక్షలో వచ్చిన మార్కులు, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులను 80:20 నిష్పత్తిలో తీసుకుని వాటి ఆధారంగా తుది ఎంపిక చేస్తారు.

ఈ టాపిక్స్ చాలా ముఖ్యం

1 క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేషన్స్, నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, క్వాంటిటీ కంపారిజన్స్, డేటా ఇంటర్‌ప్రెటేషన్, అరిథ్‌మెటిక్ టాపిక్స్. వీటిలో రేషియో, ఏవరేజ్, పర్సంటేజ్, ఏజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, సింపుల్ అండ్ కాంపౌండ్ ఇంటరెస్ట్, టైమ్ అండ్ వర్క్, టైమ్ అండ్ డిస్టెన్స్, ఎలిగేషన్, మెన్సురేషన్, పర్ముటేషన్ - కాంబినేషన్, ప్రాబబిలిటీ అత్యంత ప్రధానమైనవి.

2 రీజనింగ్: ఆల్ఫా-న్యూమరిక్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్‌రిలేషన్స్, ఆర్డర్ అండ్ ర్యాంకింగ్, ఇన్ ఈక్వాలిటీస్, వెన్ డయాగ్రమ్, సిలాజిజమ్, పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, ఇన్‌పుట్-అవుట్‌పుట్, డెసిషన్ మేకింగ్, స్టేట్‌మెంట్స్ మొదలైనవి.

3 ఇంగ్లిష్: గ్రామర్ ఆధార ప్రశ్నలు, రీడింగ్ కాంప్రహెన్షన్, ఒకాబ్యులరీ (సినానిమ్స్/ యాంటనిమ్స్). ప్రధానంగా సెంటెన్స్ కరక్షన్, రీ-అరేంజ్‌మెంట్ ఆఫ్ సెంటెన్సెస్, ఫిల్లర్స్, క్లోజ్‌టెస్ట్, సెంటెన్స్ రీ ఆర్డర్ మొదలైన గ్రామర్ ఆధారిత ప్రశ్నలు బాగా సాధన చేయాలి.

4 జనరల్ అవేర్‌నెస్: కరెంట్ అఫైర్స్, స్టాటిక్ జి.కె. లతోపాటు జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, వార్తల్లోని వ్యక్తులు, ముఖ్యమైన ప్రదేశాలు, పుస్తకాలు-రచయితలు, అవార్డులు, క్రీడావార్తలు మొదలైనవి బాగా చదవాలి.

గతంలో జరిగిన పరీక్షల ప్రశ్నపత్రాల గమనిస్తే ప్రశ్నల సరళి బోధపడుతుంది. దీనికి అనుగుణంగా సన్నద్ధతను శ్రద్ధగా కొనసాగిస్తే విజయం సాధించవచ్చు!

ఐబీపీఎస్ పీఓ పరీక్ష విధానం

ప్రిలిమ్స్

సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు	వ్యవధి
ఇంగ్లిష్ లాంగ్వేజ్	30	30	20 నిమిషాలు
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	35	35	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35	35	20 నిమిషాలు
మొత్తం	100	100	60 నిమిషాలు

మెయిన్స్

సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు	వ్యవధి
రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్	45	60	60 నిమిషాలు
డేటా ఎనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రెటేషన్	35	60	45 నిమిషాలు
జనరల్/ఎకానమీ/ బ్యాంకింగ్ అవేరెనెస్	40	40	35 నిమిషాలు
ఇంగ్లిష్ లాంగ్వేజ్	35	40	40 నిమిషాలు
మొత్తం	155	200	3 గంటలు
ఇంగ్లిష్ లాంగ్వేజ్ (లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే)	2	25	30 నిమిషాలు

ఐబీపీఎస్ పీవో పోస్టుల ఆన్‌లైన్ టెస్టులు, స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్స్, ప్రీవియస్ పేపర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
https://tinyurl.com/3wkxen9p

సన్నద్ధత ఎలా?

రెండు పరీక్షలకూ అర్హత ఉన్న అభ్యర్థులు ఐబీపీఎస్ పీఓ పరీక్షకు ప్రిపేర్ అయితే స్పెషలిస్ట్ ఆఫీసర్ ప్రిలిమ్స్ పరీక్షకు కూడా సరిపోతుంది. ఐబీపీఎస్ పీవో ప్రిలిమ్స్ అక్టోబర్ ప్రారంభంలో, మెయిన్స్ నవంబర్‌లో నిర్వహిస్తారు. ప్రిలిమ్స్‌కు ఉన్న సమయానికి తగ్గట్టుగా అభ్యర్థులు తమ సన్నద్ధత ప్రణాళిక తయారుచేసుకోవాలి. మెయిన్స్‌లోని నాలుగు విభాగాల్లో మూడు ముఖ్యమైన విభాగాలు ప్రిలిమ్స్‌లోనూ ఉంటాయి. ప్రిలిమ్స్ పరీక్ష సన్నద్ధతలోనే మెయిన్స్ సన్నద్ధత కూడా సింహభాగం పూర్తవుతుంది. కాబట్టి ఆ మూడు విభాగాలకు మెయిన్స్ పరీక్షకు తగిన విధంగానే ప్రారంభం నుంచీ సిద్ధమవ్వాలి. మెయిన్స్‌లో అదనంగా ఉండే జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్, డిస్క్రిప్టివ్ ఇంగ్లిష్‌లకు కూడా ఇప్పటినుంచే కొంత సమయం కేటాయించాలి.

తొలిసారిగా పరీక్ష రాసే అభ్యర్థులు ఆప్టిట్యూడ్, రీజనింగ్ సబ్జెక్టుల్లోని టాపిక్స్ అన్నింటినీ బాగా నేర్చుకుని సాధన చేయాలి. వీలైనంత త్వరగా వాటిని నేర్చుకోవాలి. 25, 30 రోజుల సమయం వీటికి సరిపోతుంది. టాపిక్స్ నేర్చుకున్నాక వాటిలో వివిధ స్థాయుల్లో ఉన్న ప్రశ్నలను బాగా సాధన చేయాలి. ప్రశ్నలను వేగంగా చేయగలిగేలా వివిధ షార్ట్‌కట్ పద్ధతులు ఉపయోగిస్తూ సాధన చేయాలి. నిర్ణీత సమయంలో ఎన్ని ప్రశ్నలు సాధించగలుగుతున్నారో తెలుసుకోవడానికి సమయాన్ని నిర్దేశించుకుని టాపిక్‌లవారీగా టెస్టులు రాయాలి. (ఉదాహరణకు 10 నిమిషాల్లో 10 ప్రశ్నలు).

ప్రతిరోజూ అన్ని సబ్జెక్టులూ కవర్ చేయాలి. సబ్జెక్టుల కఠినత్వం ఆధారంగా సాధనకు సమయం కేటాయించుకోవాలి. ఆప్టిట్యూడ్, రీజనింగ్‌లకు ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి సహజంగానే వాటికి ఎక్కువ సమయం కేటాయించాలి.

ప్రొఫెషనల్ నాలెడ్జ్: స్పెషలిస్ట్ ఆఫీసర్ మెయిన్స్ పరీక్షలో ఉండే ఈ విభాగం.. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న పోస్టుకు సంబంధించిన సబ్జెక్టు. ఇది వాళ్లు డిగ్రీ/ పీజీలో చదివిన సబ్జెక్టు కాబట్టి దీనికి బాగా సన్నద్ధం కావొచ్చు. స్పెషలిస్ట్ ఆఫీసర్ల తుది ఎంపిక మెయిన్స్‌లో ఉండే ప్రొఫెషనల్ నాలెడ్జ్‌లోని మార్కులు (80 శాతం), ఇంటర్వ్యూ (20 శాతం) ఆధారంగా ఉంటుంది. కాబట్టి ఇది చాలా ముఖ్యమైన విభాగం. అభ్యర్థులకు ఈ విభాగంలో ఎంత పట్టు ఉంటే తాము ఎంపిక కావడానికి అంత ఎక్కువ అవకాశం ఉంటుంది.

– డా.జి.ఎస్. గిరిధర్
డైరెక్టర్, రేస్ ఇన్‌స్టిట్యూట్

తొలిసారిగా పరీక్ష రాసే అభ్యర్థులు ఆప్టిట్యూడ్, రీజనింగ్ సబ్జెక్టుల్లోని టాపిక్స్ అన్నింటినీ బాగా నేర్చుకుని సాధన చేయాలి. వీలైనంత త్వరగా వాటిని నేర్చుకోవాలి.

నోటిఫికేషన్ వివరాలు

విద్యార్హత (21.08.2023 నాటికి)	ఏదైనా డిగ్రీ (పీఓ) నిర్ణీత విద్యార్హత (ఎస్‌ఓ)
వయసు (01.08.2023 నాటికి)	20 - 30 సంవత్సరాలు (జనరల్ అభ్యర్థులు)
దరఖాస్తు ఫీజు	రూ. 850 రూ. 175 (ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ)
దరఖాస్తుకు చివరి తేదీ	21.08.2023
ప్రిలిమ్స్ పరీక్ష	సెప్టెంబర్/అక్టోబర్ (పీఓ) 30/31 డిసెంబర్ (ఎస్‌ఓ)
మెయిన్స్	నవంబర్ (పీఓ) 28.01.2024 (ఎస్‌ఓ)
వెబ్‌సైట్:	www.ibps.in

నోటిఫికేషన్స్

ప్రవేశాలు

ఏపీ మత్స్య విశ్వవిద్యాలయంలో బీఎఫ్ఎస్సీ

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ, క్యాంప్ ఆఫీస్ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ (బీఎఫ్ఎస్సీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కళాశాల, సీట్ల వివరాలు:
1. కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్, ముత్తుకూరు (ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా): 29 సీట్లు
2. కాలేజ్ ఆఫ్ ఫిషరీ సైన్స్, నరసాపురం (పశ్చిమ గోదావరి జిల్లా): 60 సీట్లు

కోర్సు వ్యవధి: 4 సంవత్సరాలు (8 సెమిస్టర్లు)
బోధన మాధ్యమం: ఇంగ్లిష్
అర్హత: ఇంటర్మీడియట్ (ఫిజికల్ సైన్సెస్/ బయోలాజికల్ లేదా నేచురల్ సైన్సెస్)తోపాటు ఏపీ ఈఏపీసెట్ 2023 ర్యాంక్ సాధించి ఉండాలి.
వయసు: 17 నుంచి 22 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక: ఏపీ ఈఏపీసెట్ 2023 ర్యాంక్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07.08.2023.
ఆలస్య రుసుముతో: 09.08.2023.
వెబ్‌సైట్: https://apfu-ugadmissions.aptonline.in/APFU/

డాక్టర్ వైఎస్సార్ యూహెచ్ఎస్‌లో బీఎస్సీ (నర్సింగ్)

విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్... 2023-24 విద్యా సంవత్సరానికి వర్సిటీ పరిధిలోని నర్సింగ్ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద బీఎస్సీ (నర్సింగ్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
వ్యవధి: నాలుగేళ్లు
అర్హత: ఇంటర్మీడియట్ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ)తో పాటు ఏపీ ఈఏపీసెట్-2023లో అర్హత సాధించి ఉండాలి.
వయసు: 31.12.2023 నాటికి 17 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి.
దరఖాస్తు, ప్రాసెసింగ్ ఫీజు: ఓసీ అభ్యర్థులకు రూ.2360, బీసీ/ ఎస్టీ/ ఎస్సీ అభ్యర్థులకు రూ.1888.
ఎంపిక: ఏపీ ఈఏపీసెట్-2023 ర్యాంక్, రిజర్వేషన్ రూల్ ఆధారంగా.
ఏపీ ఈఏపీసెట్-2023 కటాఫ్ స్కోర్:
జనరల్ కేటగిరీ: 35682 ర్యాంకు వరకు
బీసీ/ ఎస్టీ/ ఎస్సీ, బీసీ/ ఎస్టీ/ ఎస్సీ- **దివ్యాంగులు:** 42820 ర్యాంకు వరకు
జనరల్ కేటగిరీ దివ్యాంగులు: 38058 ర్యాంకు వరకు
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 17.08.2023 .
వెబ్‌సైట్: http://drysruhs.edu.in/index.html

పోస్ట్ బేసిక్ (నర్సింగ్) కోర్సు

విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్... 2023-24 విద్యా సంవత్సరానికి వర్సిటీ పరిధిలోని నర్సింగ్ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద పోస్ట్ బేసిక్ బీఎస్సీ(నర్సింగ్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
వ్యవధి: 2 సంవత్సరాలు.
అర్హత: ఇంటర్మీడియట్‌తో పాటు నర్సింగ్ కౌన్సిల్ గుర్తించిన జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 31.12.2023 నాటికి 21 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి.
దరఖాస్తు, ప్రాసెసింగ్ ఫీజు: ఓసీ అభ్యర్థులకు రూ.2360, బీసీ/ ఎస్టీ/ ఎస్సీ అభ్యర్థులకు రూ.1888.
ఎంపిక: జీఎన్ఎం మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 17.08.2023.
వెబ్‌సైట్: http://drysruhs.edu.in/index.html

ఫైనాన్స్ అండ్ కంట్రోలింగ్ నేర్చుకుంటే?

బీబీఏ రెగ్యులర్‌గా, ఎంబీఏ డిస్టెన్స్‌లో చేశాను. బీసీఏ డిస్‌కంటిన్యూ చేశాను. యూపీఎస్సీ పరీక్షలకు నాలుగేళ్లు ప్రయత్నించి వదిలేశాను. రెండేళ్లుగా ఏమీ చేయడం లేదు. ఇప్పుడు ఎస్ఏపీ ఎఫ్ఐసీఓ నేర్చుకోవాలనుకుంటున్నాను. ఈ కోర్సుతో ఉద్యోగావకాశాలు బాగుంటాయా?
- రోహిత్

■ దాదాపుగా ఆరేళ్ల విరామం తరువాత ఎస్ఏపీ ఫైనాన్స్ అండ్ కంట్రోలింగ్ నేర్చుకోవాలని నిర్ణయించుకొన్నారు. అంటే మీ వయసు దాదాపు ముప్పై సంవత్సరాలు ఉండవచ్చు. బీబీఏ/ ఎంబీఏలో మీరు ఏ స్పెషలైజేషన్ చదివారో, ఉద్యోగానుభవం ఉందో, లేదో చెప్పలేదు. సాధారణంగా ఎస్ఏపీ ఫైనాన్స్ అండ్ కంట్రోలింగ్‌ని ఫైనాన్స్ రంగంలో కొంత అనుభవం పొందాక చేయడం శ్రేయస్కరం. ఈ రంగంలో ఉద్యోగం పొందాలంటే ఫైనాన్స్ నైపుణ్యాలతో పాటు సాంకేతిక పరిజ్ఞానం కూడా చాలా అవసరం. ఈ కోర్సు చేసినవారికి కన్సల్టెంట్లుగా ఉద్యోగావకాశాలుంటాయి. ఈ రంగంలో తక్కువ ఉద్యోగాలు అందుబాటులో ఉండటం వల్ల పోటీ ఎక్కువే. మీరు ఎస్ఏపీ ఎఫ్ఐసీఓ నేర్చుకొనేముందు ఫైనాన్స్ రంగంలో కనీసం రెండు సంవత్సరాలు పనిచేసి, ఆ విభాగానికి సంబంధించిన విషయాలపై పట్టు సాధించండి. ఈ కోర్సును మంచి శిక్షణ సంస్థ నుంచి నేర్చుకుంటే మెరుగైన ఉద్యోగం పొందే అవకాశం ఉంది. ఇందులో రాణించాలంటే అనలిటికల్, ప్రాబ్లం సాల్వింగ్, కమ్యూనికేషన్, ఇంటర్ పర్సనల్ నైపుణ్యాలు చాలా అవసరం.

వీటిలో ఏ డిగ్రీ మేలు?



ఇంటర్ సీఈసీ చదివాను. బీకాం/ బీబీఏ/బీసీఏ.. వీటిల్లో ఏ డిగ్రీ చదివితే ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయి?
- లహరి

■ చాలా యూనివర్సిటీల్లో బీసీఏ చదవాలంటే ఇంటర్‌లో మ్యాథ్స్ ఉండాలన్న నిబంధన ఉంది. కొన్ని ప్రైవేటు యూనివర్సిటీల్లో ఈ నిబంధన లేనప్పటికీ బీసీఏ మొదటి సంవత్సరంలో మ్యాథ్స్‌ని బ్రిడ్జి కోర్సుగా చేయాల్సి ఉంటుంది. సాధారణంగా బీసీఏ లాంటి కోర్సుల్లో రాణించాలంటే మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులపై పట్టు అవసరం. ఇక బీబీఏ, బీకాం రెండు కోర్సులకూ మంచి భవిష్యత్తు ఉంది. బీబీఏని పేరున్న బిజినెస్ స్కూల్‌లో చదివితే క్యాంపస్ రిక్రూట్‌మెంట్ అవకాశం ఉంది. బీబీఏ చదివినవారికి బీకాం పూర్తిచేసిన వారి కంటే కొంత ఎక్కువ వేతనం లభించవచ్చు. అదే సమయంలో బీబీఏ చదివిన వారినుంచి వ్యాపార సంస్థలు చాలా ఎక్కువ నైపుణ్యాలను ఆశిస్తున్నాయి. బీకాంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఏదో ఒక ఉపాధి దొరికే అవకాశం ఉంది. బీకాం, బీబీఏల్లో దాదాపు సగం సిలబస్ ఒకేలా ఉంటుంది. కానీ వాటిని రెండు కోర్సుల్లో ఒక్కో రకంగా బోధిస్తారు. బీకాంలో వ్యాపారానికి సంబంధించిన ప్రాథమిక అంశాలను ఎక్కువగా బోధిస్తారు. బీబీఏలో వ్యాపారానికి సంబంధించిన అప్లికేషన్‌లతో పాటు, కమ్యూనికేషన్, ప్రజెంటేషన్, ప్రాబ్లం సాల్వింగ్, కంప్యూటర్ నైపుణ్యాలపై ఎక్కువ శ్రద్ధ పెడతారు. బీకాంలో అకౌంట్స్, ఫైనాన్స్, ట్యాక్స్, బిజినెస్ చట్టాలు, బ్యాంకింగ్ లాంటి అంశాలపై బోధన ఎక్కువ. డిగ్రీతో పాటు చార్టర్డ్ అకౌంటెంట్ లాంటి కోర్సులు చేయాలంటే బీకాం చదవడం ఉపయోగకరం. భవిష్యత్తులో ఎంబీఏ చదవాలంటే బీబీఏతో పాటు, బీకాం పూర్తిచేసుకున్నవారూ అర్హులే. మీ దీర్ఘకాలిక, స్వల్పకాలిక ఆశయాలనూ, ఆసక్తినీ దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయం తీసుకోండి.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

వర్క్ ఫ్రమ్ హోమ్

గ్రాఫిక్ డిజైన్
సంస్థ: కేమ్‌లో
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 10
అర్హతలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్ నైపుణ్యాలు
internshala.com/i/154eee

బిజినెస్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్
సంస్థ: ఒజిబుక్ టెక్ సొల్యూషన్స్
స్టైపెండ్: నెలకు రూ.1,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 10
అర్హతలు: బిజినెస్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
internshala.com/i/5a2e23

క్రిప్టోకరెన్సీస్ ట్రేడింగ్
సంస్థ: ట్రేడ్‌శాల
స్టైపెండ్: నెలకు రూ.2,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 10
అర్హతలు: ఎకనామిక్స్, ఇన్వెస్టింగ్ నైపుణ్యాలు
internshala.com/i/1b2683

హైదరాబాద్‌లో

కస్టమర్ సపోర్ట్ కాల్
సంస్థ: ఎఫర్డబుల్ ఆర్గానిక్ స్టోర్
స్టైపెండ్: నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 11
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఆఫీస్ నైపుణ్యాలు
internshala.com/i/02fc73

తాజా ఇంటర్న్‌షిప్‌లు

ఆర్గనైజేషనల్ సైకాలజీ
సంస్థ: డీప్‌థాట్ ఎడ్యుటెక్ వెంచర్స్
స్టైపెండ్: నెలకు రూ.12,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 10
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, మార్కెటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/9e8c9d

క్వాలిటీ ఎస్యూరెన్స్
సంస్థ: రిజల్ స్టైపెండ్: నెలకు రూ.7,000-10,000 దరఖాస్తు గడువు: ఆగస్టు 10 అర్హతలు: క్వాలిటీ ఎస్యూరెన్స్/ క్వాలిటీ కంట్రోల్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ నైపుణ్యాలు
internshala.com/i/e1298c

స్మార్ట్‌గా ఇలా చదివెయ్యండి!

కష్టపడి జీవితంలో రాణించాలనే ఉద్దేశంతో కొందరు విద్యార్థులు అర్ధరాత్రి వరకూ చదువుతుంటారు. మళ్లీ ఉదయాన్నే మేల్కొంటున్నారు కూడా. ఇలా గంటలకొద్దీ చదివినా కొందరు ఆశించిన ఫలితాన్ని మాత్రం పొందలేకపోతుంటారు. ఏం చేయాలో తెలియక మథనపడుతుంటారు.

నవ్య సమయాన్ని ఏమాత్రం వృథా చేయదు. ఎప్పుడూ చూసినా కష్టపడి చదువుతూనే ఉంటుంది. అయినాసరే అనుకున్న మార్కులు సంపాదించలేకపోతోంది. శ్రావ్య చదువుకుంటూనే ట్యూషన్లూ చెబుతుంది. తన ఖర్చులకు డబ్బు సంపాదించుకుంటూనే మంచి మార్కులనూ సాధిస్తోంది. దానికి కారణం 'స్మార్ట్'గా చదవడమేనంటోంది. ఇంతకూ తనేం చేస్తోందో మనమూ తెలుసుకుందామా...

✿ విద్యార్థులందరి చదివే విధానం ఒకేవిధంగా ఉండదు. ముందుగా మీరు చదివే పద్ధతి గురించి ఒకసారి ఆలోచించాలి. అవసరమైన మార్పులూ, చేర్పులూ చేసుకోవాలి. పాఠ్యాంశాన్ని అర్థంచేసుకుని అవగాహన పెంచుకోవాలి. చదివేటప్పుడే నోట్‌బుక్‌ను దగ్గర పెట్టుకుని ముఖ్యాంశాలను రాసుకోవడం అలవాటు చేసుకోవాలి. ఇక్కడో విషయాన్ని గుర్తుంచుకోవాలి.. స్మార్ట్‌గా చదవడమంటే ఎక్కువ గంటలపాటు చదవడం కాదు. ముఖ్యాంశాలపై దృష్టి కేంద్రీకరించి చదవటం.

✿ సాధారణంగా మనం చదివే విధానం సరైందా కాదా అనేదాని గురించి ఎప్పుడూ ఆలోచించం. పాత పద్ధతుల్లోనే అలా చదువుకుంటూ వెళ్లిపోతుంటాం. చదివిన అంశాలనే మళ్లీ మళ్లీ చదువుతుంటాం. అలాగే రోజంతా ఒకే సబ్జెక్టును చదువుతుంటాం. ఈ రెండు పద్ధతులూ సరికావు.

✿ చదివిన తర్వాత పాఠంలోని ముఖ్యాంశాలను ఒకసారి మననం చేసుకోవాలి. క్విజ్ పెట్టుకుని రకరకాలుగా ప్రశ్నలు వేసుకుని వాటికి సమాధానాలు చెప్పుకుంటూ ఉండాలి. ఈ రెండు పనులూ చేయడం వల్ల త్వరగా మరిచిపోయే అవకాశం ఉండదు. అవగాహన పెరగడంతోపాటు చదివింది ఎక్కువకాలం గుర్తుంటుంది కూడా.

✿ ఉదాహరణకు మేథమెటిక్స్ సబ్జెక్టునే తీసుకుంటే.. దాంట్లో ఒక చాప్టర్‌ను చదివిన తర్వాత దానికి సంబంధించిన లెక్కలనే చేసుకుంటూ కూర్చోకూడదు. ఒకసారి చదవడానికి కూర్చున్నప్పుడు ఒకే చాప్టర్ కాకుండా వివిధ చాప్టర్ల లోని సమస్యలను పరిష్కరించాలి.

✿ దీన్ని మరో విధంగానూ ప్రయత్నించొచ్చు. పాఠ ప్రశ్నపత్రాల్లోని లెక్కలు చేయొచ్చు. వీటిల్లో వివిధ చాప్టర్లకు సంబంధించిన లెక్కలు ఉంటాయి. వీటిని సాధన చేయడం వల్ల ఒకేసారి వివిధ అంశాలపై అవగాహన పెరుగుతుంది.

✿ కొంతమంది ఒక సబ్జెక్టుకు వరుసగా రెండు, మూడు రోజులు కేటాయిస్తారు. ఇలా ఒకే సబ్జెక్టు చదవడం విసుగనిపించవచ్చు. దీంతో వాయిదా వేసే అవకాశమూ లేకపోలేదు. అలాకాకుండా రెండు సబ్జెక్టులు ఎంచుకుంటే ఒకదాని మీద ఏకాగ్రత కుదరనప్పుడు మరోదాన్ని చదవడం మొదలుపెట్టొచ్చు.

✿ కాస్త కష్టంగా అనిపించిన సబ్జెక్టుకు కొంతమంది విద్యార్థులు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వరు. కావాల్సినంత సమయాన్నీ కేటాయించరు. కఠినంగా అనిపించిన దాన్ని ఇలా వాయిదా వేస్తూ వెళ్లడం వల్ల పరీక్షల సమయానికి ఒత్తిడి పెరుగుతుంది.

✿ ఒక సబ్జెక్టులోని పాఠ్యాంశాన్ని చదివిన తర్వాత మర్నాడు దాన్ని పునశ్చరణ చేసుకోవాలి. రెండోసారి వెంటనే కాకుండా రెండు, మూడు రోజుల తర్వాత చేయాలి. మూడోసారి మాత్రం కనీసం వారం రోజుల వ్యవధి ఇవ్వాలి. చదివిన దాన్ని వెంటనే సమీక్షించుకుంటే సాధారణంగా గుర్తుంటుంది. ఇలా పునశ్చరణ వ్యవధిని క్రమంగా పెంచుకుంటూ వెళ్తే విషయం మెరుగ్గా అర్థమవటంతో పాటు ఎక్కువ కాలం గుర్తుంటుంది.